# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 3, మార్చి 2026


## దివ్యాంగుల కొరకు ప్రత్యేక సదరం శిబిరాలు

ఆసిఫాబాద్ ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త




జిల్లాలోని దివ్యాంగుల కొరకు ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరేన్స్ హాలులో న్యూఢిల్లీ నుండి క్యాబినెట్ కార్యదర్శి రాజన్ శర్మ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తరావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సదరం ధ్రువపత్రాల కొరక 327 మంది దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్నారని, వారి కోసం ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని, దివ్యాంగులు సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ విభాగం అధికారులు, డిపిఎం రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



## హోలీ.. రంగుల కేళీ..

- పండుగకు ప్రజలు సిద్ధం
- కలర్స్ కొనుగోళ్లలో నిమగ్నం
- నేడు హోలీ ఉత్సవాలు
- సహజ రంగులే ఆరోగ్యానికి మేలు

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 2, ప్రభాతవార్త

హోలీ.. రంగుల కేళీ. చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా అందరు కలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకుంటారు. హోలీని చెడుపై మంచి సాధించిన విజయంగా కూడా భావిస్తారు. రంగుల పండగను మంగళవారం ఆనందోత్సాహాల మధ్య జరు పుకునేందుకు మండల ప్రజలు సిద్ధమయ్యారు. పిల్లలు రంగులు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. రసాయన రంగులు వద్దని, సహజరంగులే ఆరో గ్యానికి మేలని వైద్యులు సూచిస్తున్నారు. 2లో..

## గుడుంబా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

- 35 లీటర్ల గుడుంబా స్వాధీనం.. ముగ్గురిపై కేసు నమోదు
- 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కోటపల్లి, మార్చి 2, ప్రభాతవార్త

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోటపల్లి మండలంలో గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం అర్జునగుట్ట గ్రామంలోని పలు ప్రాంతాల్లో కోటపల్లి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 35 లీటర్ల నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకోగా, తయారీకి సిద్ధంగా ఉన్న 300 లీటర్ల బెల్లపు పానకాన్ని పోలీసులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ అక్రమ మిగతా 2లో..



## బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

క్యాతన్‌పల్లి, మార్చి 2, ప్రభాతవార్త

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు సోమవారం మంచిర్యాల జిల్లా కోర్టులో ఊరట లభించింది. క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో జరిగిన అల్లర్ల కేసులో రిమాండ్‌లో ఉన్న ఆయనకు జిల్లా జడ్జి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బెయిల్ మంజూరు కోసం కోర్టు పలు నిబంధనలను విధించింది. రూ. 25,000 విలువ గల ఎగ్జిక్యూటివ్ బాండ్‌తో పాటు, ఒక్కొక్కరికి ఇద్దరు షూరిటీలను సమర్పించాలని ఆదేశించింది. అదేవిధంగా, ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల మధ్యలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు స్వయంగా హాజరై సంతకం చేయాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు రాబోయే మూడు నెలల పాటు లేదా కేసులో ఛార్జ్ షీట్ దాఖలు చేసే వరకు అమలులో ఉంటాయని జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత కొద్దిరోజులుగా రిమాండ్‌లో ఉన్న బాల్క సుమన్‌కు బెయిల్ రావడంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



## టమాటా రైతులకు నిరాశ

- గిట్టుబాటు ధర లేక ఆవేదన
- మార్కెట్ ఖర్చులకే సరిపోని ఆదాయం
- కూరగాయల కొనుగోలుతోనే రైతులకు మద్దతు: సామాజిక కార్యకర్తలు



ఇచ్చోడ, మార్చి 02, ప్రభాతవార్త:

మండల పరిధిలోని టమాటా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. పంట చేతికి వచ్చాక ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించకపోవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పెద్ద ఎత్తున టమాటా సాగు చేశారు. అయితే, ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా వెనక్కి రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. "ఒక క్యారెట్ టమాటాను పొలంలో తెంపడానికి, మార్కెట్‌కు రవాణా చేయడానికి, అక్కడి టాక్స్‌లు... ఇలా అన్ని ఖర్చులు కలిపితే క్యారెట్‌కు 60 నుండి 70 రూపాయలు అవుతోంది. కానీ, ఇచ్చోడ మార్కెట్‌లో ప్రస్తుతం క్యారెట్ ధర కేవలం 80 నుండి 100 రూపాయలు మాత్రమే పలుకుతోంది. ఇంత కష్టపడి పంట పండిస్తే మాకు మిగిలేది కన్నీరు మాత్రమే" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిపై సామాజిక కార్యకర్తలు స్పందిస్తూ.. దేశానికి అన్నం పెట్టే మిగతా 2లో..



# హోలీ.. రంగుల కేళీ..

(మొదటిపేజీ తరువాయి)

ఈ రోజుల్లో హోలీ అనగానే రసాయన రంగులు తెచ్చి గుప్పుకుంటున్నారు. వీటిని వాడటంప్రమాదం అని నిపుణులు హెచ్చరిస్తున్నా పెడ చెవిన పెడుతున్నారు. గతంలో ప్రకృతి ఒడిలో లభించే పూలతో తయారుచేసే సహజరం గులతో హోలీ ఆడేవారు. మోదుగు, శంకు, ఎర్రమందారం, గోరింటాకు తదితర పూలు, చెట్ల ఆకులతో సహజ రంగులు తయారు చేసేవారు. పూలు, ఆకులు ఎండబెట్టి వేడి నీళ్లలో నానబెట్టి రం గులు సిద్ధం చేసేవారు. వీటిని ఒంటిపై చల్లుకున్నా ఎలాంటి హాని ఉండేది కాదు. ఇంతకుముందు పల్లెల్లో మోదుగు పూలతో తయారుచేసిన రంగుకుప్రాధాన్యం ఇచ్చేవారు.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు....

✓ ఈత రాకుండా నీటిలో దిగకూడదు.
✓ చెరువుల్లోతు తెలియకుండా ఈత కొట్టడం నీటిలో విన్యాసాలు చేయడం మంచిది కాదు.
✓ ఈత వచ్చినా ఎక్కువ సమయం నీటిలో ఉండొద్దు.
✓ మద్యం సేవించిన తర్వాత ఈత కొట్టకపోవ డమే మేలు.
✓ రసాయన రంగులను చెరువులు, కుంటల్లో కడు క్కోవడంతో నీటి కాలుష్యం జరుగుతుంది.

## సూచనలు....

● హోలీ ఆడడానికి ముందు ముఖానికి మాయిశ్చ రైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం.
● రంగుల్లో ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అరికట్టవచ్చు.
● ఎరుపు రంగు కోసం బీట్రూట్, మోదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి.
● పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరల మిశ్రమం వాడొచ్చు.
● సహజ రంగుల్లో లభించే యాంటియాక్సిడెంట్లు చర్మవ్యాధులను నియంత్రించి, చర్మాన్ని మృ దువు చేస్తాయి.

## కృత్రిమ రంగులతో ఇబ్బందులు..

నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్కు కారకం.
నీలి రంగు ప్రుసియన్ బ్ల్యూ చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) కేన్స రకు కారణమవుతాయి.
పౌడర్లు, గులాల్, లెడ్, క్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్లతో వినికిడి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్పలితాలకు దారితీస్తాయి.

### ప్రాణాలతో చెలగాటం వద్దు : కుమారస్వామి, సీఐ, కాగజ్నగర్ రూరల్

రంగుల పండగ పూర్తయిన తర్వాత చాలా మంది యువకులు, పెద్దల స్నానం చేసేందుకు చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. అలాకాకుండా ఇంటి వద్దనే రంగులను కడుక్కోవడం ఉత్తమం. చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

(మొదటిపేజీ తరువాయి)

కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆకుదారి అనిల్, అట్టేలా మల్లయ్య, ఆకుదారి సదువలి అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి నుంచి గుడుంబాతో పాటు తయారీ సామగ్రిని కూడా సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబా తయారీ లేదా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబా వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి అక్రమ వ్యాపారాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, టీజీఎస్పీ కానిస్టేబుళ్లు మల్లేష్, సాయి కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు సమయాన్ని

# మరో 15 రోజులు పొడిగించండి

★ కేంద్ర మంత్రికి వినతి పత్రం అందించిన భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్



చెన్నూరు టౌన్, మార్చి 2, ప్రభాతవార్త

రైతులు పండించిన పత్తి పంటను సేకరించే క్రమంలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో పత్తిని దళారులకు అమ్ముకుండా మరో 15 రోజులు సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉండేటట్లు చూడాలని, మంచిర్యాల జిల్లా భాజపా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్ని కోరారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ రైతులు పత్తి పంట వేసే క్రమంలో వాతావరణం అనుకూలించక పత్తి విత్తడంలో ఆలస్యం జరిగిందనీ, అందుకు వ్యవసాయం కొంత మేర ఆలస్యం అయిందని, పత్తి పంట పూర్తిగా చేతికి రాకపోవడంతో మంచిర్యాల జిల్లాలో సీసీఐ కేంద్రాల సమయాన్ని మరో 15 రోజులు పొడిగించాలని కోరుతూ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్కి వినతి పత్రం అందజేసినట్లు వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. అందుకు మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

# టమాటా రైతులకు నిరాశ

(మొదటిపేజీ తరువాయి)

రైతన్నలకు అండగా నిలవాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "టమాటా మన నిత్యజీవిత వంటకాల్లో అత్యవసర భాగమైంది. కాబట్టి, మనం కూరగాయల వ్యాపారుల వద్ద టమాటాను కొనుగోలు చేస్తే పరోక్షంగా రైతులకు అండగా నిలిచినవారమవుతాం. ఒకవేళ రైతులు ఈ పంటలను వేయడం మానేసి వాణిజ్య పంటల వైపు మళ్లితే, ఇదే టమాటా భవిష్యత్తులో కిలో 100 నుండి 200 రూపాయలకు పెరిగే ప్రమాదం ఉంది. అది జరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది" అని వారు హెచ్చరించారు.

# చిన్నారి వైద్యానికి యాభై రెండు వేల రూపాయలు ఆర్థిక సహాయం

బెల్లంపల్లి, మార్చి 2, ప్రభాతవార్త

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో బెల్లంపల్లి పట్టణం అంబేద్కర్ రడగంబాల బస్తికి చెందిన ఇప్పు భారతిస్వామి దంపతుల కుమార్తె వైద్యానికి ఇప్పు స్వామికి 52 వేల రూపాయల చెక్ని జనహిత సేవా సమితి ద్వారా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ ఇప్పు భారతి స్వామి దంపతులకు నెలలు నిండక ముందే పాప జన్మించి ఊపిరితిత్తుల సమస్యతో ప్రాణాపాయ స్థితిలో మంచిర్యాలలోని అవని పిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రైవేటు ఉద్యోగం ద్వారా జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి వైద్య ఖర్చులు ఆర్థిక భారం కావడంతో నాలుగు రోజుల చిన్నారిని కాపాడేందుకు జనహిత సేవా సమితి ద్వారా దాతల నుంచి విరాళాలు సేకరించి సమకూరిన మొత్తం 52 వేల రూపాయల విలువైన చెక్ని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని, ఈ కార్యక్రమానికి పెద్ద మనసుతో నాలుగు రోజుల చిన్నారిని కాపాడేందుకు మేము సైతం ఉన్నామంటూ అతి తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో సహకారం అందించిన దాతలు ప్రతి ఒక్కరికి పేరు పేరున జనహిత సేవా సమితి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్పు రవి, ఉపాధ్యక్షులు హనుమాండ్ల రమాదేవిశ్రీనివాస్, కందుల రాజన్న, సహాయ కార్యదర్శులు బియ్యాల గణేష్, గుమ్ముల చందు గౌరవ సలహాదారులు మురుకూరి బాలాజీ, సింగతి తిరుమల్, పూదరి నగేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు గాజుల కైలాష్, మోటపలుకుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలకు మానసిక ఆరోగ్యం అవసరం

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



నస్పూర్, ప్రభాతవార్త

పిల్లలకు మానసిక ఆరోగ్యము అవసరమని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, వైద్య శాఖ అధికారులతో కలిసి కార్యక్రమ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలలో మానసిక పరివర్తన కలుగజేయడం, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయడం, పౌష్టికాహారము, జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవడం అలవాటు చేయాలని తెలిపారు. మానసిక ఆరోగ్యంలో భాగంగా ఎలాంటి సందేహాలున్న 14416 నంబర్లో సంప్రదించినట్లయితే ప్రత్యేక వైద్య నిపుణులచే ఆరోగ్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురవుతున్నా, పరీక్షలకు భయపడుతున్న ఉచిత కౌన్సిలింగ్ ద్వారా టెలిమేడ్ మానస్ కార్యక్రమంలో భాగంగా సేవలు పొందవచ్చని తెలిపారు. 8 ఆర్బిఎస్కే బృందాల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలలలో పరీక్షలు జరిగే కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలను ప్రదర్శించడం జరుగుతుందని, విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. ఏ ప్రసాద్, డిపిఓ ప్రశాంతి, సిహెచ్ఓ లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, సంపత్ కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లాలోని ఆర్బిఎస్కే వైద్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని పెంచికలపేట్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం పోశన్న తమ గ్రామములో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు నాసిరకంగా చేస్తున్నారని, సదరు కాంట్రాక్టు పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అదేవిధంగా ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన కామ్రే సోంబాయి తనకు యిప్పలనావెగం గ్రామంలో గల పట్టా భూమిని తన పేరిట చేయాలని, బెజ్జూర్ మండలం సలుగుపల్లి గ్రామానికి చెందిన జనగాం ఫక్కీరు తన తండ్రి మరణించినందున ఆయన పేరిట గల భూములను తన పేరిట విరాసత్ మార్పిడి చేయాలని, ఆసిఫాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీకి చెందిన అనుమల్ల గణేష్ తాను సిఆర్ఎస్ క్రింద పూర్తి డబ్బులు చెల్లించానని, ఫైనల్ సర్టిఫికేట్ ఇప్పించాలని, కౌటాల మండలం వీర్దండి గ్రామానికి చెందిన సిడ తుకారం తనకు చెందిన భూములను తమకు తెలియకుండా ఇతరుల పేరిట పట్టా చేశారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని, కాగజ్ నగర్ మండలం గ్రామానికి చెందిన అల్ల రాజేశ్, ఆసిఫాబాద్ పట్టణం జన్కాపూర్ కు చెందిన కాట్కర్ కల్పన లు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సిపిఆర్ఓతో వచ్చే రిజిస్టర్ల పై 48 గంటలలో నివేదికలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు



## ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండో విడత శిక్షణ తరగతులు

### - గ్రామ పరిపాలనపై అవగాహన పెంచుకోవాలి: ఎంపీడీవో లక్ష్మీకాంత్

**సారంగాపూర్, మార్చి 02, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండో విడత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీకాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలామంది ఉపసర్పంచులు, వార్డు సభ్యులుగా నూతనంగా ఎన్నికయ్యారని, గ్రామ పరిపాలన విధానాలపై పూర్తి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలు, నిధుల వినియోగం, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో చురుగ్గా పాల్గొని ప్రజలకు మెరుగైన పాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.



## ఇచ్చోడలో బోరిగాం సర్పంచ్ ఆసిఫ్, ఉపసర్పంచ్‌కు ఘనసన్మానం

**ఇచ్చోడ, మార్చి 02, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బోరిగాం సర్పంచ్ ఆసిఫ్, ఉపసర్పంచ్ సాయి చరణ్ రెడ్డిలను ఆదివాసీ నాయకుడు సోయం విక్రమ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముస్తఫా, రాజు, కాత్లే బుచ్చన్న, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## రితీష్ రెడ్డికి సీఏలో ర్యాంక్.. గ్రామస్తుల సన్మానం

**దిలావర్పూర్, మార్చి 2, ప్రభాతవార్త:**

మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజారెడ్డి రేష్మ దంపతుల కుమారుడైన గడ్డం రితీష్ రెడ్డి సిఏ ఆల్ ఇండియా 3వ ర్యాంకు పొంది ఉద్యోగం సాధించాడు. తమ కుమారుడు ర్యాంకు సాధించి ఉద్యోగం పొందడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తమకే కాదు గ్రామానికి పేరు తేవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు దీంతో సోమవారం అతనిని వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, బిజెపి నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శైలేశ్వర్, మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, సాయి రెడ్డి, నరేష్, నవీన్, సాయి, శ్రావణ్, పందరి, విజయ్, ముత్యం, తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

### ✪ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 02, ప్రభాతవార్త:**

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఎలాంటి ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, ప్రజల నుంచి విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ఇప్పటివరకు జిల్లాలో రైతులు 1.60 లక్షల యూరియా బస్తాలు బుక్ చేసుకున్నారని వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇదే సందర్భంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లాకు మొత్తం 25 పతకాలు (4 స్వర్ణ, 8 రజత, 13 కాంస్య) రావడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను, కోచ్‌లను అభినందించారు. అంతకుముందు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన జిల్లా సహకార అధికారి నర్సయ్య ఆత్మకు శాంతి చేకూరాలని అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా అధికారి మృతి చెందడం పట్ల కలెక్టర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, వెంకటేశ్వర్లు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## వివో భవన నిర్మాణ పనులకు భూమి పూజ

**తాండూర్, మార్చి 2, ప్రభాతవార్త :**

మండలంలోని అచ్చలాపూర్ లో వివో భవన నిర్మాణ పనులకు సోమవారం ఎంపిడిఓ శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షలతో వివో భవనం నిర్మించనున్నట్లు తెలిపారు మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు వివో భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మరిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, ఏపిఎం శ్యామల, పిఆర్ ఏఈ సాయిలత, కార్యదర్శి కల్పన, నాయకులు గట్టు మురళీధర్ రావు, మరిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వివో భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎంపీడీవో శ్రీనివాస్

## సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థినికి సన్మానం

**తాండూర్, మార్చి 2, ప్రభాతవార్త :**

రాష్ట్రస్థాయి సీఎం కప్ కుస్తీ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన తాండూర్ మండలం అచ్చలాపూర్ జెడ్పిహెచ్ఎస్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చౌల్ల హర్షితను సోమవారం స్థానిక సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీఎం కప్ కుస్తీ పోటీలలో హర్షిత ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించి 15 వేల ప్రైజ్ మనీ గెలుచుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఏపిపిసి చైర్మన్ చిలకమ్మ, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థిని హర్షితను సన్మానించి అభినందిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

## చెరువులో పూడికతీత పనులు చేపట్టాలి

**తాండూర్, మార్చి 2, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం చౌటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంకెపల్లి చెరువులో పూడికతీత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయకట్టు రైతులు ఎంపీడీవో శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా చెరువు పూడికతీత తీయకపోవడంతో చెరువులో మట్టి పేరుకు పోయిందన్నారు. చెరువుల మట్టి పేరుకుపోవడం వలన గత వర్షాకాలంలో కురిసిన అధిక వర్షాల వలన చెరువు కట్ట తెగిపోయిందన్నారు. చెరువు ఆయకట్టు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని కోరారు.



## కువైట్‌లో అదృశ్యమైన కుమారుడిని రప్పించండి: కలెక్టర్‌కు తండ్రి వేడుకోలు

### - జిల్లా కలెక్టర్ ఆదేశంతో మామడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

**సారంగాపూర్, మార్చి 02, ప్రభాతవార్త:**

ఉపాధి కోసం కువైట్ వెళ్లిన తన కుమారుడు గత కొంతకాలంగా ఆచూకీ లేకుండా పోయాడని, అతడిని క్షేమంగా స్వదేశానికి రప్పించాలని మామడ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రామావత్ సూర్య సోమవారం జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్య కుమారుడు రామావత్ ప్రశాంత్ (31), ముప్కాల్‌కు చెందిన ఒక ఏజెంట్ ద్వారా హౌస్ డ్రైవర్ వీసాపై 2023లో కువైట్‌కు వలస వెళ్లాడు. అక్కడ చేరిన మొదటి నాలుగు నెలలు సక్రమంగానే పనిచేసి, జీతం కూడా భార్యకు పంపించాడు. అయితే, ఆ తర్వాత ప్రశాంత్ నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ రావడం లేదని, తాము ప్రయత్నించినా స్పందన లేదని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి విన్నపాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈ విషయంపై తక్షణమే మామడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రశాంత్ తండ్రి ఎన్.ఆర్.ఐ అడ్వైజరీ కమిటీ రాష్ట్ర సభ్యులు స్వదేశ్ పరికిపండ్లను కలిసి తన కుమారుడి వివరాలను అందజేశారు. ప్రభుత్వం స్పందించి తన కుమారుడిని క్షేమంగా ఇంటికి చేర్చాలని ఆయన కోరుతున్నారు.

# ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు

## శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం: నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 02, ప్రభాతవార్త:**

ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కొనియాడారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ముదావహమని అన్నారు. శ్రీపాదరావు చేసిన ప్రజా సేవలే ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయని, నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్నకళ్యాణి, సీపీఓ జీవరత్నం, డీఈవో భోజన్న, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీటీడీవో అంబాజీ, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీపాదరావు చేసిన సేవలు ఆదర్శనీయం...

**- ఎస్పీ నితికా పంత్**

**ఆసిఫాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:**

శ్రీపాదరావు చేసిన సేవలు ఆదర్శనీయమని ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ సభాపతి దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీపాదరావు శాసనసభ్యుడిగా, సభాపతిగా ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సభను నిష్పక్షపాతంగా, గౌరవప్రదంగా నడిపి అధికార, విపక్షాలకు సమాన న్యాయం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. శాసనసభ గౌరవం, నియమావళి పటిష్టతకు ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ వామన మూర్తి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడిన మహనీయుడు: తహసీల్దార్ యాదవ్‌రావు

**దస్తురాబాద్, మార్చి 02, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదవ్ రావు మాట్లాడుతూ.. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు అని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలే ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆక్టివిస్ట్ సట్ట శేఖర్, మండల సర్వేయర్ సంధ్య, సీనియర్ అసిస్టెంట్ మధు, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేష్, జీపీఓ వెంకట్, లావణ్య, వినోద్, శేఖర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



**బెల్లంపల్లి, మార్చి 2, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఏరియా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో సోమవారం రోజున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అసెంబ్లీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి శ్రీపాదరావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. స్పీకర్‌గా, ఎమ్మెల్యేగా ఉమ్మడి రాష్ట్రంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, డీజీఎం (ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహేర, డీజీఎం (సివిల్) మదినా బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఏరియా సర్వే అధికారి అప్సర్ పాషా, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి రాజేశ్వర్ రావు, ఎస్టేట్ అధికారి సాగర్, సెక్యూరిటీ అధికారి శ్రీధర్, సీనియర్ పిఓ శ్రీనివాస్, ఐటీ హెచ్ఓడి ముజీబ్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి, మార్చి 2, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాజీ స్పీకర్ స్వర్గీయ డి. శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, యూనియన్



నాయకులు, సిబ్బంది కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడు శ్రీపాదరావు అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఆయన సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడారని పేర్కొన్నారు. ఆయన సాదాసీదా జీవన విధానం, ప్రజల పట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. శ్రీపాదరావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా




నివాళులు అర్పిస్తున్న ఎస్పీ నితికా పంత్

పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ప్రసాద్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, డీజీఎం పర్సనల్ అశోక్, సీ.ఎం.ఓ.ఏ.ఐ జాయింట్ సెక్రటరీ రవి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఐటీయూసీ జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతలో శ్రీపాద రావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, మార్చి 2, ప్రభాతవార్త**

నిబద్ధతలో శ్రీపాద రావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీపాద రావు జయంతిని నిర్వహించారు. మునిగంటి శ్రీనివాస్ శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ, శాసనసభ్యునిగానే కాకుండా స్పీకర్‌గా కూడా ఆయన మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. స్పీకర్‌గా శ్రీపాద రావు ఎంతో హుందాగా వ్యవహరిస్తూ ఆ పదవికే వన్నె తీసుకువచ్చారని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రజానేతగా నిలిచారని గుర్తు చేశారు. స్వగ్రామం ధన్వాడలో సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మంథని నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం సుమలత, డీవై పీఎం కిరణ్ కుమార్, సీనియర్ పీఓలు మురళి, సురేందర్, ప్రశాంత్, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మ, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి సందీప్, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.







శ్రీపాద రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్, అధికారులు

## ప్రధాన రహదారిపై వ్యాపారం..

# ప్రజల ప్రాణాలతో చెలగాటం

**● అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు.. ● ట్రాఫిక్ జాంలతో ప్రయాణికుల అవస్థలు**



**ఇచ్చోడ, మార్చి 02, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మళ్లీ యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు డివైడర్ల కోసం కేటాయించిన స్థలాన్ని వ్యాపార సముదాయంగా మార్చుకోవడంతో ప్రజల ప్రాణాలు పణంగా మారుతున్నాయి. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా బస్టాండు సమీపంలో రోడ్డు మధ్యలో వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో, వాహనాలు నిలిపి కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగి ట్రాఫిక్ జాంలు నిత్యకృత్యంగా మారాయి. పక్షం రోజుల క్రితమే రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించినా, పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లే వరకు అధికారులు నిద్రలేవరా? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశ (వార్షికోత్సవ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యాలు, గీతాలు, ప్రేరణాత్మక ప్రసంగాలతో సభ ఉత్సాహభరితంగా సాగింది. విద్య సంవత్సరం మొత్తం నిర్వహించిన కార్యక్రమాలపై వార్షిక నివేదికను ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల సమర్పించారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న పదవ తరగతి జూనియర్ విద్యార్థులు స్నేహపూర్వక వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎల్కపల్లి సర్పంచ్ భక్తు రాంచందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ భాస్కర్, ఉప సర్పంచ్ అనిల్, ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవాని, భాష, భాగ్యశ్రీ, ఉజ్వల, ఆత్మరాం, సమ్మయ్య, ధనరాజ్, సంతోష్, లక్ష్మి, భారతి, నాగరాణి, ఈశ్వర్ రావు, మోనిక, అప్తాబ్, విజయ్, సుజాత నాయకులు కృష్ణ, నగేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

**వాంకిడి, మార్చి 2, ప్రభాతవార్త :**



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

వాంకిడి మండల కేంద్రంలో కోవ లక్ష్మి ఫౌండేషన్ మరియు డైలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణను, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం బ్యాట్ పట్టి స్వయంగా క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, వాంకిడి సర్పంచ్ సతీష్, బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, ప్రవీణ్ మాజీ సింగిల్ విండో చైర్మన్ జబరి పేంటు, వివిధ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అజయ్ కుమార్, జబరి రవీందర్, పోటు శ్రీధర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు మరియు బిఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.



## సేంద్రియ పంటలను సాగు చేయాలి

**- ఏ వో రామకృష్ణ**

**దహెగాం, ప్రభాతవార్త :**

రైతులు సేంద్రియ పంటలను సాగు చేయాలనీ మండల వ్యవసాయధికారి రామకృష్ణ అన్నారు. దహెగాం మండలంలోని గిరవెల్లి రైతు వేదికలో ఎన్ ఎం ఎన్ ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు సేంద్రియ పంటలు, ఎరువులు వాటి ప్రాముఖ్యత గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సేంద్రియ పంటలను సాగు చేయాలనీ దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేస్తాయని అన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యత మట్టి ఆరోగ్య పరిరక్షణ, రసాయనాల వినియోగం తగ్గుతుందని, జీవామృతం, ఘనజీవామృతం, ఎరువుల తయారీ వాటి వినియోగం గురించి, సమతుల్య ఎరువుల వినియోగం, పంటల సుస్థిర సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేసారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారులు సుష్మిత, ఆనంద్, లావణ్య, రోహిణి, ఆదిత్య, సాయిల్ టెస్టింగ్ ల్యాబోరేటర్ వెంకటేష్, సి అర్ పి లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవికి ముందే నీటి భరోసా

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 2, ప్రభాత వార్త :**

పెంచికల్ పేట్ గ్రామంలోని పద్మశాలి వీధిలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వీధిలో నీటి సమస్య పరిష్కారం దిశగా సర్పంచ్ షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో సోమవారం నూతన బోర్ ( చేతి పంపు ) నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. చేతి పంపు ఏర్పాటుతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పద్మశాలి వీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, నాయకులు రమేష్ కృష్ణా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## సర్పంచులకు రెండో విడత శిక్షణ తరగతులు ప్రారంభం

**- పరిపాలన విధానాలపై అవగాహన కల్పించిన డీఎల్పీఓ లింగయ్య**

**సారంగాపూర్, మార్చి 02, ప్రభాతవార్త:**

మండలంలోని డ్యాంగాపూర్‌లో గల మహిళా ప్రాంగణంలో సోమవారం సర్పంచులకు రెండో విడత శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమానికి సారంగాపూర్, నర్సాపూర్ (జి), దిల్‌వార్‌పూర్, దస్తురాబాద్, కుంటాల మండలాలకు చెందిన సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీ అధికారి లింగయ్య హాజరై ప్రసంగించారు. స్థానిక పరిపాలనలో సర్పంచులు అనుసరించాల్సిన విధానాలు, పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన, గ్రామ అభివృద్ధిలో వారి పాత్ర గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీఓలు అజీజ్ ఖాన్, తిరుపతిరెడ్డి, గోవర్ధన్, రమేష్ రెడ్డిలతో పాటు టీఓటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు దేగామలో ఘన సన్మానం

**- మున్సిపల్ చైర్మన్ మన నియోజకవర్గ బిడ్డే: ఆడే గజేందర్**

**బజార్‌హత్నూర్, మార్చి 02, ప్రభాతవార్త:**

మండలంలోని దేగామ గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌లను సోమవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ మన ఇంటి బిడ్డ అని, మన నియోజకవర్గ సోదరి అని కొనియాడారు. ప్రజల ఆశీర్వాదంతో ఈ ఉన్నత స్థాయికి చేరుకున్న అనూష సతీష్ ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్, దేగామ సర్పంచ్ దుర్వ దేవ్ బాయి లక్ష్మణ్, మోర్కండి సర్పంచ్ తొడసం నాందేవ్, చందునాయక్ తండా సర్పంచ్ రజాక్ పాల్గొన్నారు. వీరితో పాటు కళ్ళెం విఠల్, పోరెడ్డి నారాయణ, కోడారి నరేష్, దేవన్న, శివుడు, సయ్యద్ సల్మాన్, సూర్యవంశీ పాండురంగ్, కిషన్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ సంరక్షణపై అవగాహన

**సారంగాపూర్, మార్చి 02, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని సారంగాపూర్ వెస్ట్ జోన్ అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ సంరక్షణలో వన్యప్రాణుల ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ.. వన్యప్రాణులతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అవి అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రకృతి వనరులను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అప్పుడే భవిష్యత్తు తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించగలమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**నస్పూర్, మార్చి 2, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన గజెల్లి నర్సయ్య తన భూమిలోకి కొందరు అక్రమంగా చొరబడి బోర్ వేశారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కాసిపాక విజయ్ కుమార్, బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన దాగం చరణ్ తాము తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని పోరాడామని, తమ పేర్లను ఉద్యమకారుల జాబితాలో నమోదు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన బొద్దుల స్వప్న దివ్యాంగురాలు అయిన తనకు ప్రభుత్వ పథకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌కు చెందిన పోలికోట సుజిత్ నిరుపేద ట్రాన్స్ జెండర్ అయిన తనకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. డీ మార్కేషన్, జాతీయ రహదారుల విస్తరణలో అవార్డు పెంచాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ భూముల కబ్జాలు, బఫర్ జోన్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి చర్యలు తీసుకోవాలని, అంత్యోదయ కార్డు మంజూరు కొరకు ఇతర అంశాలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంథని నియోజకవర్గ శాసనసభ్యులుగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని, మంథని ప్రాంత అభివృద్ధిపై విశేష కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



## పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు

**జన్నారం, మార్చి 2, ప్రభాతవార్త**

జన్నారం మండలం లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగానే జన్నారం మండలం కలమడుగు గ్రామంలోని వివేకానంద పాఠశాలలో హోలీ పండుగ ఎందుకు జరుపుకుంటారు అనే అంశంపై చిన్నారులతో నాటకం వేయించి కార్యక్రమం నిర్వహించారు. ఈ నాటిక చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే హోలీ రంగులను ప్రకృతి నుంచి వచ్చే రంగులను వాడాలని, కెమికల్ రంగులను అసలు వాడకూడదని పిల్లలకు పాఠశాల కరెస్పాండెంట్ సతీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, ఇన్చార్జి తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

**వేమనపల్లి, మార్చి 02, ప్రభాతవార్త**

దస్నాపూర్ గ్రామానికి చెందిన దుర్గం దుర్గయ్య అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో మరణించగా వారి భార్య దుర్గం చిన్నక్క నిరుపేద, వికలాంగురాలు కావున ఇట్టి విషయంపై నేతకాని నాయకులు జాడి గోపాల్ నేతకాని కుల సంఘ పెద్దలకు తెలియపరచగా మాజీ రాష్ట్ర నేతకాని కుల సంఘం అధ్యక్షులు ముడిమడుగుల శంకర్, రాష్ట్ర నాయకులు దుర్గం గోపాల్, జాడి బానయ్య, జిల్లా అధ్యక్షులు గోమాస శ్రీకాంత్, నాయకులు ముడిమడుగుల మహేందర్, దుర్గం జనార్ధన్ వచ్చి ఆమెకు ధైర్యం చెప్పి ఓదార్చి వారికి రూ.5 వేల నగదు సాయం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమరం రమేష్, తాళ్ల వెంకటేష్ గౌడ్, సమ్మయ్య, ప్రశాంత్ స్వామి నేతకాని కులస్తులు పాల్గొన్నారు.



## గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**నస్పూర్, మార్చి 2, ప్రభాతవార్త**

మహిళలలో గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదన కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ఇతర అధికారులతో కలిసి గర్భాశయ క్యాన్సర్ నిర్మూలన సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గర్భాశయ క్యాన్సర్ అంతం చేసేందుకు ప్రభుత్వం నడుము బిగించిందని, ఇందులో భాగంగా జిల్లాలో 14 సంవత్సరములు నిండిన 15 సంవత్సరంలోపు ఉన్న బాలికలకు సుమారు 8 వేల 184 మంది బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఒక డోసు ఎడమ చేతికి ఇచ్చిన తర్వాత చూపుడు వేలికి గుర్తింపు కోసం ఇంకు పెడతారని, వివరాలను యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమము 3 నెలల పాటు కొనసాగుతుందని, తర్వాత ఈ కార్యక్రమమును జాతీయ టీకాల కార్యక్రమంలో కలపడం జరుగుతుందని తెలిపారు. వ్యాక్సిన్ వేయించుకునే పిల్లలు, ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పేరెంట్స్ టీచర్ సమావేశం నిర్వహించి, ఈ వ్యాక్సిన్ ఉపయోగం వివరములు తెలియజేసిన తర్వాత వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని, వ్యాక్సిన్ తీసుకునే పిల్లలు ఖచ్చితంగా టిఫిన్ / భోజనం చేసి రావాలని తెలిపారు. టీకా తీసుకున్నాక అరగంట పాటు వ్యాక్సిన్ కేంద్రంలోనే ఉండాలని, వ్యాక్సిన్ తీసుకోవడం పూర్తిగా స్వచ్ఛందమని, అనారోగ్యంతో ఉన్నా, అలర్జీలు ఉన్నా వ్యాక్సిన్ వేయరని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పిపి యూనిట్లలో, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, వైద్యాధికారుల ఆధ్వర్యంలో టీకా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఇంటర్ విద్యాశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల అనుసంధానంతో, స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమమును చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డా. ఏ ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డిపిఓ ప్రశాంతి, సిహెచ్ఓ లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ స్వామి, పద్మ, డిపిహెచ్ఎన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**ఇచ్చోడ, మార్చి 02, ప్రభాతవార్త:**

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం పలువురు మృతుల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఇచ్చోడ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహిమూద్ సోదరులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, ఇటీవల గుడిహత్నూర్ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మాజీ మోజన్ ఖాదీర్ భార్య కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకుని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట నాయకులు పాండురంగ్, రమేష్, గణేష్, దేవేందర్ రెడ్డి, ప్రతాప్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్ట్

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**తాండూర్, మార్చి 2, ప్రభాతవార్త :**

మండలంలోని రేచిని (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) జెడ్పి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ భౌతిక శాస్త్రవేత్త సి.వి.రామన్ చిత్రపటానికి హెచ్ఎం, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్ ప్రదర్శించారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, పోస్టర్ మేకింగ్, సైన్స్, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మసాడి ప్రదీప్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి వార్డు మెంబర్ కేశెట్టి సంతోష్, ఉపాధ్యాయులు రవి, రత్నయ్య, శ్రీనివాస్, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ చట్టాలపై అవగాహన సదస్సు

**బెజ్జూర్, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండలంలోని పాపన్నపేట్ గ్రామంలో సోమవారం ఎఫ్ఆర్ఓ ముసవీర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులు కళాజాత బృందంచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడవుల సంరక్షణ వాటి ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణపై కళాజాత బృందం సభ్యులు గ్రామస్తులకు వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయని వాటిని నరకడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని సకాలంలో వర్షాలు పడక అకాల వర్షాలు సంభవిస్తాయని అన్నారు. అడవులు మన సహజ సంపదని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అడవులు అంతరించినట్లయితే పర్యావరణం కాలుష్యం కోరల్లో చిక్కుకొని ఆక్సిజన్ లభించని దుస్థితి వస్తుందని అన్నారు. అలాగే అడవుల్లో జీవించే వన్యప్రాణులను కాపాడుకోవడం కూడా మన బాధ్యతేనని అన్నారు. వాటిని వేటాడడం చట్టరీత్యా నేరమని, వాటికోసం ఉరులు బిగించడం విద్యుత్ షాక్ పెట్టడం వంటివి చేసినట్లయితే శిక్ష తప్పదని హెచ్చరించారు. అటవీ చట్టాలపై యువతకు అవగాహన కల్పించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణ కూడా అందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సాఫియా బేగం, ఎఫ్బిఓ లు గోపాల్, స్రవంతి, కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిరుపేదల పెన్నిధి చెన్నూర్ లయన్స్ క్లబ్

**ఘనంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం - 49 మందికి ఉచిత కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి ఆసుపత్రికి తరలింపు**

**చెన్నూర్, మార్చి 2, ప్రభాతవార్త**



నిరుపేదల సేవలో చెన్నూర్ లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని మరోసారి చాటుకుంది. సోమవారం చెన్నూర్ పట్టణంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జాడి తిరుపతి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మదేకర్ ఉదార నేత్ర వైద్యశాల వారి సౌజన్యంతో, వైస్ చైర్మన్ చిదుర సురేష్ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు జాడి తిరుపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్య శిబిరానికి 68 మంది బాధితులు హాజరుకాగా, వారికి ప్రాథమికంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించిన అనంతరం కంటి పరీక్షలు చేయించామని తెలిపారు. అనంతరం చూపు తక్కువగా ఉన్న 49 మందిని గుర్తించి వారికి ఉచిత ఆపరేషన్ల కోసం ఎంపిక చేశామని, వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధి ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ మోధుంపురం వెంకటేశ్వర్, కార్యదర్శి సౌడం శ్రీనివాస్, కోశాధికారి నిమ్మల సాగర్, లయన్ సభ్యులు పల్లె సతీష్ గౌడ్, ఎన్నం సతీష్, బుద్ధారపు ప్రకాష్ బాబు, కొత్తూరు దుర్గా ప్రసాద్, రావుల మధుకర్, కొమ్మెర నవీన్, మోర్ల మధుకర్, తుమ్మ శ్రీపాల, లట్టి రాజాబాపు తదితరులు పాల్గొన్నారు.



## మందమర్రిలో వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం, విగ్రహ ప్రతిష్ఠాపన

**మందమర్రి, మార్చి 02, ప్రభాతవార్త:**

మందమర్రి పట్టణంలోని విలేజ్ రామకృష్ణాపూర్‌లో గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. ఆలయ గర్భగుడికి ఇరువైపులా ద్వారపాలకులను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అలాగే, ఆలయ ఆవరణలో గ్రామ దేవత పోచమ్మను ప్రత్యేక పూజా కార్యక్రమాల నడుమ ప్రతిష్ఠించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. ప్రతిష్ఠాపన అనంతరం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు మందమర్రి నుంచే కాకుండా పరిసర గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరై కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి కమిటీ చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతం కావడంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు విశేషంగా శ్రమించారు.



## ఆసిఫాబాద్ పురపాలక సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకాష్

**ఆసిఫాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ పురపాలక సంఘం చైర్మన్ గా మెంగ్రే ఆకాష్ అధికారకంగా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఆ శాఖ కమీషనర్ గజానంద్ సమక్షంలో నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా వైస్ చైర్మన్ గా ఎండి అహ్మద్, కౌన్సిలర్లు చిలివేరి వెంకటేశ్వర్లు, నాగుబాయి, బాలకృష్ణ, భార్గవితో పాటు పలువురు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పాలకవర్గం కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ ఆసిఫాబాద్ పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, రాష్ట్రంలోనే ఆసిఫాబాద్ పురపాలక సంఘంను అభివృద్ధి పరంగా తొలి స్థానంలో నిలబెడుతామన్నారు. దీనికి గాను పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం ప్రజాపతినిధులు, పురపాలక సంఘం సిబ్బంది శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు.



పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీడ్ ఇండియా సభ్యులు

## లక్ష్యసాధనకు అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

**- దేవులవాడ పాఠశాలలో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస సదస్సు**

**కోటపల్లి, మార్చి 2 ప్రభాతవార్త**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఒక గొప్ప ఆదర్శమని ప్రముఖ మనస్తత్వవేత్త సత్య ప్రకాష్ పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని దేవులవాడ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం లీడ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన, వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మనస్తత్వవేత్త సత్య ప్రకాష్ మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు అబ్దుల్ కలాం వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. పాఠశాల దశలోనే విద్యతో పాటు వివేకం, సాంకేతిక నైపుణ్యాలు, ఆత్మరక్షణ వంటి అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. లీడ్ ఇండియా రాష్ట్ర స్థాయి శిక్షణ మేనేజర్ తాడూరి శ్రీనివాస ఆచార్య మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయంపు శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బాలికా సాధికారత, సైబర్ భద్రత, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన్నారం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**జన్నారం, మార్చి 2, ప్రభాతవార్త**



ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్



ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్

స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సోమవారం నాడు అందరి సభ్యుల సమక్షంలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గాజుల లింగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జాడి వెంకట్, ఉపాధ్యక్షులుగా ఎంబడి మల్లేశ్, సతీష్ గౌడ్, మేడ మురళీధర్, కోశాధికారిగా శీల చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా నిమిషకవి రాజేందర్, కొండపల్లి ప్రశాంత్, మధుర సతీష్, ముఖ్య సలహాదారులుగా పూదరి సత్యనారాయణ, మందపల్లి కాంతయ్య, కందుల రమేష్, గడ్డం భానుకిరణ్, ప్రచార కార్యదర్శిగా గోనె సత్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని, అలాగే అందరి సభ్యుల సహకారం ఉండాలని, అందరం కలిసి ఒక కుటుంబ వ్యక్తుల లాగ కలిసి మెలిసి ఉండి క్లబ్ యొక్క గొప్పతనాన్ని, మన ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థుల్లో వన్యప్రాణుల సంరక్షణపై చైతన్యం

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాలలో విద్యార్థినిలకు అవగహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణుల రక్షణ అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రాలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అడవుల పరిరక్షణ, జీవవైవిద్యం ప్రాధాన్యత వంటి అంశాలపై విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ అస్మా, ఎఫ్ఎస్ఓ సుభాన్ గౌరీ, బీట్ అధికారులు అరవింద, లచ్చన్న, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ఫారెస్ట్ అధికారులు

## సహజసిద్ధమైన రంగులతోనే హోళీ సంబరాలు నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:**



హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో సహజసిద్ధమైన రంగులతోనే సంబరాలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సోమవారం సూచించారు. హానికరమైన రసాయనిక రంగులు వాడకుండా సహజ రంగులకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం నిషేధమని స్పష్టం చేశారు. హోళీ పండుగను సాంప్రదాయబద్ధంగా, పరస్పర గౌరవంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. పండుగ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తామని, ఉల్లంఘనలకు ఎలాంటి సడలింపులు ఉండవని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాలు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వాహనదారులకు ఆటంకం కలిగించవద్దని సూచించారు. జిల్లా వ్యాప్తంగా షీ టీమ్‌లు ప్రత్యేకంగా మోహరింపు చేస్తున్నామని, ప్రధాన కూడళ్లలో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లవద్దని, పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక మాధ్యమాల్లో అపోహలు వ్యాప్తి చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోళీ పండగను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# రసాయన రహిత వ్యవసాయమే భవిష్యత్తు

## రిమ్మలో అవగాహన సదస్సు - నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకంపై రైతులకు అవగాహన




**సిరికొండ, మార్చి 02, ప్రభాతవార్త:**

మండలంలోని రిమ్మ గ్రామ పంచాయతీ కేంద్రంలో సోమవారం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకంపై రైతులకు ఒకరోజు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమ్మతో పాటు రాజెంపేట, తిమ్మాపూర్, తుమ్మల్‌పాడ్ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోచంపల్లి ఏఈఓ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల నేల తల్లి నిస్సారమవడమే కాకుండా, ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో సాగు చేయడం ద్వారానే నాణ్యమైన, విషరహిత ఆహారాన్ని అందించగలమని ఆయన పేర్కొన్నారు. జిల్లా సెర్మెడి ప్రతినిధులు మాట్లాడుతూ, సహజ వ్యవసాయంలో ఖరీదైన రసాయన ఎరువులు కొనాల్సిన అవసరం లేదని, ఆవు పేడ, మూత్రం వంటి స్థానిక వనరులతో తయారు చేసే జీవామృతం, బీజామృతం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించవచ్చని రైతులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ మిషన్ ద్వారా రైతులను ప్రకృతి సాగు వైపు మళ్లించేందుకు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. స్థానిక సర్పంచ్, సిరికొండ మాజీ ఎంపీపీ మాట్లాడుతూ, పురాతన సాగు పద్ధతులకు ఆధునిక సాంకేతికతను జోడించి లాభదాయకమైన వ్యవసాయం చేయాలని కోరారు. అనంతరం అధికారులు రైతులతో ముఖాముఖి నిర్వహించి, సహజ పద్ధతుల్లో చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు, సీఆర్టీ మిత్రులు

## సీఆర్టీ ఉపాధ్యాయురాలికి ఆర్థిక సాయం

**కాగజ్‌నగర్, మార్చి 2, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో సీఆర్టీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సీడం అన్నపూర్ణ ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. పది రోజుల క్రితం పాఠశాల నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆమె కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్స చేయించుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు , సీఆర్టీ మిత్రులు స్పందించి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. వారి ద్వారా మొత్తం రూ.1,19,000 (అక్షరాల ఒక లక్ష పందొమ్మిది వేలు) సేకరించారు.ఈ సందర్భంగా సీఆర్టీ సంఘం ప్రతినిధులు ఆమె స్వగ్రామమైన కాగజ్‌నగర్‌కు వెళ్లి పరామర్శించి సేకరించిన మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్టీ అధ్యక్షుడు కొమరెల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి జరుపుల విజేష్, హరికుమార్, యశోద, ప్రేమ్‌సాగర్, నాగు తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యాయుల ఐక్యతను ప్రతిబింబించే ఈ చర్యను స్థానికులు అభినందించారు

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డుల సందర్శన

### - మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నరసయ్య

**లక్షెట్టిపేట, ప్రభాతవార్త**



సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డులను సందర్శిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నరసయ్య తెలిపారు. లక్షెట్టిపేట పట్టణంలోని మున్సిపాలిటీ లోని 13వ వార్డులో సోమవారం రోజున చైర్మన్ దొంత అంజలి నరసయ్య, వైస్ చైర్మన్ రాజేశ్వరి వెంకటస్వామి, 13వ వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ గడపగడపకు తిరుగుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని వివరించారు. వార్డుకు సంబంధించిన పారిశుద్ధం నాలిలా క్లీనింగ్ మంచినీటి సమస్య ఎక్కడెక్కడ నూతన డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం వార్డుకు సంబంధించిన అవసరాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రాబోయే రోజుల్లో వార్డులు సుందరికరణ తీర్చిదిద్దడం కోసం కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సురేఖమ్మ దృష్టికి తీసుకెళ్లి ప్రతి ఒక్క సమస్య వివరించి ఆ పనులు చేయడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నరసయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి వెంకట్ స్వామి గౌడ్, 13వ వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ, వార్డు అధ్యక్షుడు సయ్యద్ హాజీ, కౌన్సిలర్ రాజు, సయ్యద్ హాఫీజ్, లగిశెట్టి వెంకటస్వామి, ఇక్బాల్, బిలాల్, శ్రీనివాస్,బాబ్జి, మోహన్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వేలాల గోదారి పుష్కర ఘాట్‌లను సందర్శించిన ప్రభుత్వ అధికారులు

**జైపూర్, మార్చి 2, ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ సూచనల మేరకు సోమవారం అన్ని శాఖల అధికారులు వేలాల గ్రామంలో గోదావరి పుష్కర ఘాట్‌లను సందర్శించారు. 2027లో రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లను అంచనా వేయడానికి అధికారులు విచ్చేశారు. గోదావరి ఘాట్‌ల వద్ద స్నాన ఘాట్‌లకు దారితీసే ప్రస్తుత రహదారుల విస్తరణ, భక్తులకు సరైన మార్గంలో బయటకు వెళ్లేందుకు ప్రత్యేకమైన రోడ్లను ఏర్పాటు, తగినన్ని స్నాన ఘాట్లు, వేదికలు, భక్తులకు ఆశ్రయాలు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం, పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాలను అంచనా వేయడం, శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ దర్శనం, పండుగ సమయంలో భక్తులకు సరైన ప్రవేశం, నిష్క్రమణకు తగినంత స్థలం ఉండేలా చూసేందుకు ఆలయ సముదాయం చుట్టుపక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డేగ స్వప్న, జైపూర్ ఏ.సి.పి వెంకటేశ్వర్లు, ఎం.పీ.డీ.ఓ గుర్రాల సత్యనారాయణ, తహసీల్దార్ వనజా రెడ్డి, ఆర్.డబ్ల్యు.ఎస్ డి.ఈ.ఈ విద్యాసాగర్ ఆలయ ఈ.ఓ రమేష్ (ఎండోమెంట్స్), ఎస్ఐ రాజశేఖర్, ఎ.ఇ మనోహర్, ఉప సర్పంచ్ సుందిల్ల రాజలింగు, పంచాయతీ సెక్రటరీ రాకేష్ మెడికల్, ఫిషరీష్ అధికారులు పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు

**వేమనపల్లి, మార్చి 02, ప్రభాతవార్త**

వేమనపల్లి రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరన్న రైతులకు సేంద్రీయ వ్యవసాయం యొక్క ఆవశ్యకతను వివరించడం జరిగింది. ఈ శిక్షణలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలలో సహజ వ్యవసాయం విధానాలు, జీవామృతం, బీజామృతం, మల్చింగ్, అంతర పంటల సాగు, ఆకర్షణ పంటలు సరిహద్దు పంటల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. ప్రత్యేకంగా పత్తి పంటలో గులాబీ గింజ పురుగు నియంత్రణ, ఫెరోమోన్ ఉచ్చుల వినియోగం, ముందస్తు విత్తనం ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవారం నియంత్రణ, వరి పంటలో సహజ కలుపు నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సహజ వ్యవసాయం ద్వారా ఖర్చు తగ్గింపు, మట్టి ఆరోగ్యం మెరుగుదల, భూమిలో సూక్ష్మజీవుల పెరుగుదల, వర్ష పురుగుల (ఎర్త్ వార్మ్స్) సంరక్షణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు సహజ వ్యవసాయంపై ఆసక్తి వ్యక్తం చేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్గం బక్కన్న ప్రకృతి వ్యవసాయం గురించి తన అనుభవాన్ని రైతులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఎఫ్ఎసి రైతులు ఇతర రైతు బంధువులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం



వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు

## నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### - తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగుంట చంద్రశేఖర్

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వృద్ధులైన కళాకారులకు పెన్షన్లు, హెల్త్ కార్డ్స్, తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన కళాకారులకు సముచిత స్థానం కల్పించే విధంగా రాబోయే బడ్జెట్ లో కళాకారులకు కొంత శాతం కేటాయించి ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు కేటాయించిన విధంగా కొంత శాతం రిజర్వేషన్లు కల్పించాలని, వృత్తి కళాకారులకు డిపిఆర్ఓ ద్వారా జిల్లావ్యాప్తంగా కళా ప్రదర్శనలు కల్పించాలని, సాంస్కృతిక సారథిలో పనిచేస్తున్న కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగుంట చంద్రశేఖర్, మిట్టపల్లి పౌల్, గంగా రామ్, బియ్యాల ఉపేందర్, బబ్బుర్ రాజేందర్, చొప్పదండి కిషన్, మిట్టపల్లి మల్లేష్, బొంకురి రామచందర్, రవి, పుష్ప, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్యంలో మానవ జీవనం కూడా అడవితో ముడిపడి ఉంది

### - ఎఫ్ఆర్‌వో సుష్మా రావు




విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎఫ్ఆర్‌వో సుష్మా రావు

**జన్నారం, మార్చి 2, ప్రభాతవార్త**

జీవ వైవిధ్యంలో మానవ జీవనం కూడా అడవితో ముడి పడి ఉంది అని ఎఫ్ఆర్‌వో సుష్మా రావు అన్నారు. జన్నారం మండలం తపాలపూర్ గ్రామంలో జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, అలాగే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మానవ జీవన మనుగడకు అడవుల ప్రాధాన్యత ఎంతో కలిగి ఉందని వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుంపల తిరుపతి కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలకు మొదటి సారి విచ్చేసిన ఎఫ్ఆర్‌వో సుష్మా రావుకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నదీమ, శంకర్, ఉపాధ్యాయ బృందం, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.